# బిఎస్ఎన్ఎల్‌కు అవసరం లేని శస్త్రచికిత్స

## టెలికం రంగంలో దోపిడీని మరింత తీవ్రం చేసేందుకు దారితీసే శ్యాంపిట్రోడా కమిటీ సిఫార్సులు

### *శ్యాంపిట్రోడా కమిటీ నియామకం*

నష్టాలు వచ్చే దశకు చేరుకున్నదనే నెపంతో బిఎస్ఎన్ఎల్‌ను ప్రైవేటీకరణ దారి పట్టించాలనే ఆలోచన ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు వచ్చింది. అందుకు తగిన సిఫా ర్సులు చేయాలని తన సలహా దారు శ్యాం పిట్రోడా అధ్యక్షులుగా, టెలికం డిపార్టుమెంటు సెక్రటరీ పి.జె. థామస్, హెచ్‌డి ఎఫ్‌సి బ్యాంకు ఛైర్మన్ దీపక్ పరేఖ్ సభ్యులుగా 6.1.2010న ఒక కమిటీని నియ మించారు. 9.2.2010న ఈ కమిటీ తన రిపోర్టును మెరుపు వేగంతో అతి స్వల్ప కాలంలో సమర్పించింది.

### *కమిటీ సిఫార్సులు*

శ్యాం పిట్రోడా కమిటీ సిఫార్సులలో కొన్ని ఈ క్రింది విధంగా వున్నాయి.

- 3 లక్షల మంది బిఎస్ఎన్ఎల్ ఉద్యో గులలో లక్షమందిని విఆర్ఎస్ మరియు ఇతర సంస్థలకు బదిలీల ద్వారా తొలగించాలి.
- బిఎస్ఎన్ఎల్‌లో 30% వాటాలు ఒక భారత కీలక భాగస్వామి (స్ట్రేటజిక్ పార్టనర్)కి అమ్మాలి. లేదా ఐపిఓ (ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ద్వారా అమ్మాలి. అమ్మగా వచ్చిన సొమ్ములో రెండు వంతులను విఆర్ఎస్ అమలుకు మరియు బిఎస్ఎన్ఎల్ విస్తరణకు వినియోగించి మిగతా ఒక వంతు సొమ్మును ప్రభుత్వ ఖజానాకు చెల్లించాలి.
- మొబైల్ సర్వీసుల విస్తరణ కోసం అవ సరమైన 9 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్ మెంట్ కొనుగోలుకు పిలిచిన టెండరును రద్దు చేయాలి. ఎయిర్‌టెల్, వొడాఫోన్ తదితర ప్రైవేటు ఆపరేటర్లు చేస్తున్న విధంగా ఈ ఎక్విప్‌మెంట్ సప్లై చేసే నోకియా, ఎరిక్‌సన్, హువాయి తదితర విదేశీ సంస్థ లకు మొబైల్ సర్వీసుల నెట్‌వర్క్ విస్తరణ మరియు నిర్వహణ బాధ్యతను 'మేనేజ్‌డ్ సర్వీసెస్' పద్ధతిలో అప్పగించాలి. దీనివలన ఉద్యోగుల అవసరం తగ్గుతుంది. పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.
- బిఎస్ఎన్ఎల్‌కు దేశవ్యాపితంగా అన్ని పట్టణాలలో, గ్రామాలలో విస్తరించి వున్న లోకల్ కాపర్ కేబుల్‌ను ఉప యోగించుకుని బ్రాడ్ బ్యాండ్ ఇంట ర్నెట్ సర్వీసులు అందించేందుకు వీలుగా ప్రైవేటు సంస్థలకు అద్దె కివ్వాలి.
- టవర్సు స్థాపన, నిర్వహణకు ఒక సబ్సి డియరీ సంస్థను ఏర్పాటుచేయాలి.
- బిఎస్ఎన్ఎల్‌కు ఏడు ప్రధాన నగరా లలో మొత్తం 25 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణం గల ఖాళీస్థలాలు వున్నాయి. ఈ స్థలాలను అభివృద్ధి చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు ఒక సబ్సిడియరీ సంస్థను ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలి.
- 3 సంవత్సరాల కాంట్రాక్టు పద్ధతిలో బిఎస్ఎన్ఎల్ బోర్డు డైరెక్టర్లును నియ మించాలి. సిఎండి (ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్) పోస్టును రెండుగా విడగొట్టి ఛైర్మన్‌గా ఒక స్వతంత్ర వ్యక్తిని, టెలికం మంత్రి శాఖ ఒత్తిళ్ళను తట్టుకోగలిగిన వారిని నియమించాలి. మేనేజింగ్ డైరెక్టర్‌గా మరొకరిని నియమించాలి.

ప్రభుత్వరంగసంస్థ పద్ధతిలో కాకుండా ప్రైవేటురంగ సంస్థ పద్ధతిలో బిఎస్ ఎన్ఎల్‌ను నిర్వహించటం, ముక్కలు ముక్క లుగా విభజించి ప్రైవేటుపరం చేయటం ఈ సిఫార్సుల ఉద్దేశం. టెలికం రంగంలో స్వదేశీ విదేశీ బడా పెట్టుబడిదారులు కుమ్మక్కై చేస్తున్న దోపిడీని మరింత తీవ్రం చేయటమే ఈ సిఫార్సుల వుద్దేశం.

### *టెలికం రంగంలో జరుగుతున్న దోపిడి*

1997లో భారతదేశంలో టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 1 కోటి 53 లక్షలు. వీరిలో 1 కోటి 50 లక్షల మంది ల్యాండ్‌లైన్ వినియోగదారులు కాగా 3 లక్షల మంది మొబైల్ ఫోన్ వినియోగదారులున్నారు. కాగా 31.1.2010 నాటికి వినియోగదారుల సంఖ్య 58 కోట్లు అయింది (మొబైల్ 54.5 కోట్లు, ల్యాండ్ లైన్ 3.5 కోట్లు). ఈ విధంగా 13 సం॥లలో వినియోగదారుల సంఖ్య 1 కోటి 53 లక్షల నుండి 58 కోట్లకు అద్భుతంగా పెరిగింది. టెలిఫోన్ వినియోగారుల సంఖ్య విషయంలో 105 కోట్లతో (74 కోట్లు మొబైల్, 31 కోట్లు ల్యాండ్‌లైన్) చైనా అగ్రస్థానాన్ని సాధించగా 58 కోట్లతో భారతదేశం ద్వితీయ స్థానాన్ని సాధించింది.

కానీ భారతదేశంలో జరిగిన ఈ విస్తారమైన అభివృద్ధి ఫలితాన్ని భారత ప్రభుత్వం స్వదేశీ-విదేశీ బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా అనుసరిస్తున్న పంథా వలన, స్వదేశీ-విదేశీ బడా పెట్టుబడిదారుల కూటమి దోచుకుంటున్నది. దీని ఫలితంగా-

- విదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలు భారీ ఆదాయాన్ని పొందాయి.
- ప్రైవేటు టెలికం సర్వీసుల కంపెనీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) భారీగా పెరిగింది.
- ప్రైవేటు టెలికం సర్వీసు కంపెనీలు ప్రభుత్వ ఖజానాని భారీగా లూటీ చేశాయి.
- స్వదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలు ఖాయిలాపడ్డాయి.
- టెలికం సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేసే ప్రక్రియ ఆగిపోయింది.
- టెలికం రంగంలో శ్రమదోపిడీ తీవ్ర మయింది. ట్రేడ్ యూనియన్ హక్కులు లేని ప్రైవేటు రంగం విస్తరించింది.
- దేశభద్రతకి ప్రమాదం కలిగే అవకాశం ఏర్పడింది.

### *విదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలు కొల్లగొట్టిన ఆదాయం*

31.1.2010 నాటికి భారతదేశంలో 54 కోట్ల మొబైల్ వినియోగదారులున్నారు. వీరికి మొబైల్ లైన్స్ కనెక్షన్ ఇవ్వటానికి వీలు కలిగించే జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంట్‌ను మోటరోలా, నోకియా, ఎరిక్‌సన్, హువాయి తదితర విదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థల నుండి కొనటం జరిగింది. స్వదేశీ కంపెనీలు ఈ పరికరాలను తయారుచేసే స్థితిలో లేకపోవటమే దీనికి కారణం. ఈ విధంగా 54 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంట్ కోసం లైన్‌కు సుమారు రూ. 3000 చొప్పున మొత్తం రూ. 1,62,000 కోట్లు మనదేశ సంపదను ఈ విదేశీ కంపెనీలకు చెల్లించటం జరిగింది.

ఇంతేగాక 54 కోట్ల మొబైల్ వినియోగదారులు వాడుతున్న మొబైల్‌ఫోన్ హ్యాండ్‌సెట్స్ కూడా విదేశీ కంపెనీలైన మోటరోలా, నోకియా, శామ్‌సంగ్, సోనీ ఎరిక్‌సన్ వంటివి తయారుచేసినవే. ఒక హ్యాండ్‌సెట్ విలువ సగటున రూ. 3000 అనుకుంటే మొత్తం మరో రూ. 1,62,000 కోట్లు విదేశీ కంపెనీలకు చెల్లించాల్సి వచ్చింది.

ఈ విధంగా గత 13 సం॥లలో మన దేశం దాదాపు రూ. 3,24,000 కోట్లు విదేశీ టెలికం పరికరాల ఉత్పత్తిదారులకు చెల్లించింది.

### *ఖాయిలాపడిన స్వదేశీ టెలికం పరికరాల తయారీసంస్థలు*

మొబైల్ సర్వీసులకు అవసరమైన టెలికం పరికాల ఉత్పత్తిని స్వదేశీ కంపెనీలు చేసేందుకు గత ఎన్‌డిఏ ప్రభుత్వం కాని, ప్రస్తుత యుపిఏ ప్రభుత్వముగాని ప్రోత్సహించలేదు. దీని ఫలితంగా ప్రభుత్వ రంగ టెలికం పరికరాల ఉత్పత్తి సంస్థలయిన ఐటిఐ, హెచ్‌సిఎల్ జబ్బుపడిన సంస్థలుగా తయారయ్యాయి.

### *దేశభద్రతకి ప్రమాదం*

మొబైల్ సర్వీసులకు అవసరమైన జిఎస్ఎం ఎక్విప్‌మెంటు పరికరాలను తగిన పర్యవేక్షణ లేకుండా విదేశీ కంపెనీల నుండి కొనుగోలు చేస్తున్నందున, మన టెలికం నెట్‌వర్క్ విదేశీశక్తులకు అందుబాటులో వుంటుంది. ఇంతేగాక ఎయిర్‌టెల్, రిలయన్స్, వొడాఫోన్ వంటి ప్రైవేటు సంస్థలన్నీ తమ టెలికం నెట్‌వర్క్ ప్లానింగ్, ఇన్‌స్టలేషన్, మెయింటెనెన్స్ అంతా తమకు పరికరాలు సప్లై చేస్తున్న నోకియా, మోటరోలా, ఎరిక్‌సన్, హువాయి వంటి విదేశీ సంస్థలకే అప్పగించాయి. తాము బ్రాండింగ్ మరియు మార్కెటింగ్‌కే పరిమితమయ్యాయి. విదేశీ పరికరాల తయారీ సంస్థలను ఈ విధంగా తమ వ్యాపారంలో భాగస్వాములుగా చేసి, పరికరాలకు చెల్లించకుండా ఆదాయంలో భాగమిస్తున్నాయి. సత్వర, అధిక లాభాల కోసమే ఇది జరుగుతున్నది. ఈ విధంగా ప్రైవేటు టెలికం సర్వీసు కంపెనీలు తమ నెట్‌వర్క్ నిర్వహణ విదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలకు అప్పగించాయి. మన టెలికం నెట్‌వర్క్ నిర్వహణ ఈ విధంగా విదేశీపరం కావటం దేశభద్రతకి ప్రమాదం.

### *టెలికం సర్వీసుల రంగంలో పెరుగుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి*

టెలికం సర్వీసుల కంపెనీలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ) పరిమితిని 49% నుండి 74%కు పెంచాలని ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రతిపాదించగా, యుపిఏ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదించి అమలులోకి తెచ్చింది. దీని ఫలితంగా ఇప్పటికి అనేక టెలికం సర్వీసు కంపెనీలలో ఎఫ్‌డిఐ వాటా భారీగా పెరిగింది. ఉదాహరణకి వొడా ఫోన్ ఎస్సార్‌లో 67%, భార్తీ ఎయిర్‌టెల్‌లో 48%, యూనినార్‌లో 74%, టాటా టెలిసర్వీస్‌లో 26% ఎఫ్‌డిఐ వున్నది. ఈ విధంగా మన టెలికం సర్వీసుల ఆదాయంలో విదేశీ పెట్టుబడిదారులకు గణనీయమైన వాటా దక్కుతున్నది.

### *ప్రైవేటు టెలికం కంపెనీలచే ప్రభుత్వ ఖజానా లూటీ*

వేల కోట్ల రూపాయిల లైసెన్స్ ఫీజు చెల్లిస్తామని హెచ్చు టెండరు వేసి ల్యాండ్ లైన్ మరియు మొబైల్ సర్వీసుల నిర్వహణకు లైసెన్సు పొందిన ప్రైవేటు టెలికం సర్వీసు కంపెనీలు ఆ తరువాత 1999లో ఆనాటి ఎన్‌డిఏ ప్రభుత్వం పై వత్తిడి తెచ్చి టెండర్ ప్రకారం చెల్లించాల్సిన లైసెన్స్ ఫీజుని రద్దు చేయించి, తమకు వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని లైసెన్స్ ఫీజుగా చెల్లించేందుకు అంగీకరింపజేసాయి. ప్రభుత్వ ఖజానాకు తాము చెల్లించాల్సిన రూ. 50,000 కోట్లు ఫీజును ఈ విధంగా రద్దు చేయించుకున్నాయి. టెలికం కుంభకోణంగా ఇది ప్రసిద్ధి చెందింది.

టెలికం సర్వీసుల దేశవ్యాపిత నిర్వహణకు మరియు దానితో పాటు 2జి స్పెక్ట్రమ్ (మొబైల్ ఫోన్‌కాల్స్‌ను పంపించటానికి అనువుగా వాతావరణంలో వుండే విద్యుదయస్కాంత తరంగాలు) పొందటానికి అవసరమైన లైసెన్స్‌ను 2001 నాటి రేటుకే (రూ. 1641 కోట్లు) ప్రభుత్వం నుండి పొందిన కొత్త టెలికం కంపెనీలు వెంటనే తమ లైసెన్స్ వాటాలను విదేశీ టెలికం సర్వీసు కంపెనీలకు ఐదారు రెట్లు అదనపు రేటుకు అమ్ముకుని గాలివాటుగా సుమారు రూ. 60,000 కోట్లు లాభాన్ని పొందాయి. ఈ విధంగా ప్రభుత్వ ఖజానాకు చెందవలసిన రూ. 60,000 కోట్లు లూటీచేసాయి. యుపిఏ ప్రభుత్వం మరియు ప్రైవేటు టెలికం కంపెనీలు సంయుక్తంగా 2008-09లో నిర్వహించిన ఈ కుంభకోణం 'స్పెక్ట్రమ్ కుంభకోణం'గా ప్రసిద్ధి చెందింది.

1986లో టెలికం సర్వీసులను టెలికం డిపార్టుమెంటు మాత్రమే నిర్వహించే రోజులలో, టెలిఫోన్ల సంఖ్య ఒక కోటి కూడా లేని రోజులలో టెలికం డిపార్టుమెంటులో 6 లక్షలమంది ఉద్యోగులుండేవారు. కానీ ఈనాడు డిఓటి స్థానంలో టెలికం సర్వీసులను నిర్వహిస్తున్న బిఎస్ఎన్ఎల్‌లో 3 లక్షల ఉద్యోగులే వున్నారు. ఈ విధంగా 3 లక్షల ఉద్యోగాలు తగ్గాయి. టెలికం సర్వీసులను నిర్వహిస్తున్న ప్రైవేటు కంపెనీలన్నింటిలో ఉద్యోగుల సంఖ్య చాలా స్వల్పం. అవన్నీ కలిపినా లక్షకు మించవు. వీటిలో అత్యధికం స్వల్ప వేతనాలతో వున్న కాంట్రాక్టు ఉద్యోగాలు. ఈ ప్రైవేటు కంపెనీలలో పని ఎక్కువ, జీతాలు తక్కువ. యూనియన్లు, కార్మిక హక్కులు లేవు. టెలిఫోన్ల సంఖ్య ఒక కోటి నుండి 58 కోట్లకు పెరిగినప్పటికీ, టెలికం సర్వీసుల రంగంలో రెగ్యులర్ మరియు యూనియన్ల ప్రభావం వున్న ఉద్యోగాల

సంఖ్య 6 లక్షల నుండి 3 లక్షలకు తగ్గింది. రద్దయిన 3 లక్షల ఉద్యోగాల స్థానంలో ప్రైవేటు టెలికం సర్వీసుల కంపెనీలలో ఎటువంటి హక్కులూ లేని స్వల్ప వేతనపు ఉద్యోగాలు లక్ష వరకూ వచ్చాయి.

టెలికం పరికరాల తయారీ సంస్థలయిన ఐటిఐ, హెచ్‌సిఎల్‌లు ఖాయిలా పడినందున అక్కడ ఉద్యోగుల సంఖ్య బాగా తగ్గింది. నోకియా, ఎరిక్‌సన్ తదితర విదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలు తమ ఫ్యాక్టరీలను తమిళనాడు (శ్రీ పెరుంబుదూరు) తదితర ప్రాంతాలలో పెట్టినప్పటికి అక్కడ పనిచేసే కార్మికులకు రూ. 3000 నుండి రూ. 5000 మాత్రమే జీతాలు ఇస్తున్నాయి. ఎటువంటి ట్రేడ్ యూనియన్ హక్కులూ లేవు.

ఈ విధంగా టెలికం రంగంలో పెరిగిన ఉత్పత్తి విలువలో శ్రమశక్తికి లభించే వాటా విపరీతంగా తగ్గి, పెట్టుబడికి లభించే వాటా విపరీతంగా పెరిగింది.

### ఆగిపోయిన స్వదేశీ పరిశోధన, అభివృద్ధి

టెలికం రంగంలో సాంకేతిక పరిజ్ఞానం నిరంతరం అభివృద్ధి చెందుతుంది. కాబట్టి ఈ పరిజ్ఞానాన్ని దేశీయంగా పెంపొందించుకోవాలంటే ప్రభుత్వ ప్రోత్సాహంతో సమర్థవంతమైన పరిశోధన, అభివృద్ధి సంస్థలు ఉండాలి. గతంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటుచేసిన సి-డాట్ సంస్థ ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్‌కు అవసరమైన టెలిఫోన్ ఎక్ఛేంజ్ ఎక్విప్‌మెంట్‌ను నాణ్యమైన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించి అభివృద్ధి చేసింది. దేశీయంగా ఈ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ పరికరాలను వుత్పత్తి చేయటం జరిగింది. కాని సరళీకరణ విధానాలు, ప్రైవేటు టెలికం సర్వీసు కంపెనీల ప్రవేశం, మొబైల్ సర్వీసుల విస్తరణతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. మొబైల్ సర్వీసుల నెట్‌వర్క్ విస్తరణకు అవసరమైన జిఎస్‌ఎం/సిడిఎంఎ ఎక్విప్‌మెంటు తయారీకి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం మనదేశంలో లేదు. దానిని విదేశాల నుండి స్వీకరించి మన పరిశోధనా సంస్థలలో అభివృద్ధి చేసుకోవాలి. కానీ స్వదేశీ టెలికం సర్వీసుల కంపెనీలకు ఇదంతా చేయటంలో ఆసక్తి లేదు. మేనేజ్‌డ్ సర్వీసెస్ పద్ధతిలో తమకి అవసరమైన మొబైల్ లైన్స్ ఎక్విప్‌మెంటును స్థాపించి నిర్వహించే పనిని విదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలకే అప్పగించి తక్కువ పెట్టుబడి ఖర్చుతో, తక్కువ ఉద్యోగులతో తక్షణ, అధిక లాభాలు దండుకోవటానికే పరిమితమయ్యాయి. దీని ఫలితంగా మొబైల్ టెలికం సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను నిరంతరం విదేశీ కంపెనీల నుండి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెలికం సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా అభివృద్ధి చేసే ప్రక్రియ ఆగిపోయింది.

చైనాలో ఇందుకు భిన్నంగా జరిగింది. అక్కడ టెలికం సర్వీసులను 3 ప్రభుత్వరంగ సంస్థలు (చైనా టెలికం, చైనా మొబైల్, చైనా యూనికాం) నిర్వహిస్తున్నాయి. ప్రైవేటు కంపెనీలు లేవు. కాబట్టి ఈ ప్రభుత్వరంగ సంస్థలు స్వదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థల నుండే పరికరాల కొనుగోలుకు నిర్ణయించాయి. ఈ స్వదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలు తమకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని విదేశీ కంపెనీల నుండి వాటికి తమ సంస్థలలో భాగస్వామ్యం కల్పించటం ద్వారా, సాంకేతిక పరిజ్ఞానాన్ని తమకి బదిలీ చేయాలని షరతు విధించటం ద్వారా సాధించాయి. ఈ విధంగా సాధించిన పరిజ్ఞానాన్ని పరిశోధల ద్వారా మరింత పెంపొందించాయి. ఈ విధంగా చైనా టెలికం పరికరాల తయారీ సంస్థలైన హువాయి, జడ్‌టిఇ మొదలగునవి అద్భుతమైన అభివృద్ధిని సాధించాయి. మనదేశంతో సహా అనేక దేశాలకు నాణ్యమైన టెలికం పరికరాలను ఎరిక్‌సన్, మోటారోలా, నోకియా తదితర పాశ్చాత్య దేశాల కంపెనీల కన్నా తక్కువ ధరకు సప్లై చేయగలిగే స్థాయికి చేరుకున్నాయి.

### ప్రభుత్వరంగ సంస్థగా బిఎస్ఎన్ఎల్ ప్రాధాన్యత

సామాజిక అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని, గ్రామీణ ప్రాంతాలకు, వెనకబడిన ప్రాంతాలకు నష్టాలు భరించి సేవలందిస్తున్న ప్రభుత్వరంగ సంస్థ బిఎస్ఎన్ఎల్. దేశ భద్రతని దృష్టిలో వుంచుకుని రక్షణశాఖకు అవసరమైన టెలికం నెట్‌వర్క్‌ను స్థాపించి నిర్వహిస్తున్నది. స్వదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలయిన ఐటిఐ తదితర సంస్థలను ప్రోత్సహించేందుకు తన నెట్‌వర్క్ విస్తరణకు అవసరమైన ఎక్విప్‌మెంటు కొనుగోలులో 30% మేరకు ఆర్డర్లు ఇస్తున్నది. గ్రామీణ ప్రాంతాలకు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమాచారాన్ని అందించే బాధ్యతలో ప్రధాన పాత్ర నిర్వహిస్తున్నది. ప్రైవేటు కంపెనీల లాగా తన నెట్‌వర్క్ విస్తరణ, నిర్వహణను విదేశీ సంస్థలకు అప్పగించకుండా తానే నిర్వహించి దేశభద్రతకు తోడ్పడుతున్నది. 3 లక్షల మంది ఉద్యోగులతో ఎస్‌సి/ఎస్‌టి/బిసి రిజర్వేషన్లతో ఉద్యోగాల కల్పన మరియు సామాజిక న్యాయం అందించటంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. మొబైల్ సర్వీసుల రేట్లను అక్రమంగా అధిక స్థాయిలో వుంచి వినియోగదారులను ప్రైవేటు కంపెనీలు లూటీ చేస్తున్న పరిస్థితిలో 2002 లో మొబైల్ సర్వీసుల రంగంలో ప్రవేశించి ఈ రేట్లు తగ్గే విధంగా బిఎస్ఎన్ఎల్ చేయగలిగింది. లైసెన్స్ ఫీజు, స్పెక్ట్రం ఛార్జి, సర్వీసు ఛార్జి, డివిడెండు తదితర అనేక రూపాలలో ప్రభుత్వ ఖజానాకు నిధులు సమకూరుస్తున్నది. 2008-09 సంవత్సరపు బ్యాలన్స్ షీట్ ప్రకారం బిఎస్ఎన్ఎల్‌కు రూ. 76,133 కోట్లు నిల్వ మరియు మిగులు నిధులు (రిజర్వ్ & సర్‌ప్లస్)న్నాయి. నగదు మరియు బ్యాంక్ బ్యాలెన్స్ రూ. 38,134 కోట్లు వున్నది. దేశవ్యాపితంగా విస్తరించిన నెట్‌వర్క్ వున్నది. ఈ విధంగా ఆర్థికవ్యవస్థలో చెప్పుకోతగిన పాత్ర నిర్వహిస్తున్నది. బిఎస్ఎన్ఎల్ పుస్తక విలువ (బుక్ వాల్యూ) రూ. 4,00,000 కోట్లు కాగా వాస్తవ విలువ అంతకు పదిరెట్లు వుంటుంది.

### బిఎస్ఎన్ఎల్ పై దాడి

బిఎస్ఎన్ఎల్‌ను నిర్వీర్యం చేసి తమకు ఎదురు లేకుండా చేసుకోవాలని, విలువైన దాని ఆస్తులు ప్రైవేటీకరణ పేరుతో చకచగా కొట్టేయాలని స్వదేశీ-విదేశీ బడా పెట్టుబడిదారుల కూటమి కోరుకుంటున్నది. అందుకోసం ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తున్నది.

గత ఎన్‌డిఏ ప్రభుత్వం, నేటి యుపిఏ ప్రభుత్వం ఇందుకు అనుగుణంగా పని చేస్తు న్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ల్యాండ్‌లైన్ సేవలందిస్తున్నందున ఏర్పడుతున్న నష్టాన్ని భర్తీ చేసేందుకుగాను బిఎస్ఎన్ఎల్‌కు ప్రైవేటు టెలికం కంపెనీలు చెల్లిస్తున్న ఏక్సెస్ డెఫిసిట్ ఛార్జీని ప్రభుత్వం రూ. 5000 కోట్ల నుండి క్రమంగా తగ్గించి చివరికి పూర్తిగా రద్దు చేసింది. 2006 వరకు టెలికం సర్వీసుల రంగంలో బిఎస్ఎన్ఎల్ అగ్రస్థానంలో వుంది (వినియోగదారుల సంఖ్య మరియు ఆదాయంలో). ప్రైవేటు కంపెనీల కన్నా చాలా ఆలస్యంగా 2002 ఆఖరులో మాత్రమే ప్రభుత్వం అనుమతించినప్పటికి స్వల్ప కాలంలోనే 2006 నాటికి మొబైల్ సర్వీసుల రంగం లో ఎయిర్‌టెల్‌కు పోటీగా రెండవ స్థానాన్ని సాధించింది. ఇందుకు తట్టుకోలేని ప్రైవేటు కంపెనీలు కుట్ర చేసి ప్రభుత్వంపై ఒత్తిడి చేసాయి. దీని ఫలితంగా ప్రభుత్వం అనేక అభ్యంతరాలు లేవనెత్తి, ప్రైవేటు కంపెనీలు కోర్టుకు వెళ్ళి, మొబైల్ సర్వీసుల విస్తరణకు అవసరమైన 4 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్ మెంటు కొనుగోలు టెండరు విషయంలో ముందుకు పోకుండా బిఎన్ఎన్ఎల్‌కు బ్రేకు వేసాయి. ఇందుకు వ్యతిరేకంగా ఉద్యోగులు, అధికారులు అందరూ కలిసి 11.7.2007న ఒకరోజు సమ్మె చేసిన తరువాత, 4 కోట్ల లైన్ల టెండర్‌ను రెండు కోట్ల లైన్లకు కుదించి కొనుగోలు చేయటం జరిగింది. ఆ తరువాత మరో 9 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంటు కొనుగోలుకు టెండరు వేయగా గత టెండర్ సందర్భంగా జరిగిన విధంగానే ప్రైవేటు కంపెనీలు కోర్టుకు వెళ్ళి, ప్రభుత్వం అనవసరపు అభ్యంతరాలు సృష్టించి ముందుకు పోకుండా చేసాయి. చైనా కంపెనీ హువాయి నుండి ఎక్విప్‌మెంటు కొనుగోలుకు ప్రైవేటు కంపెనీల అనుమతినిచ్చి, బిఎస్ఎన్ఎల్‌కు మాత్రం దేశభద్రత పేరుతో బోర్డరు సర్కిల్సు లో ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. చివరకు ఈ టెండరును రద్దు చేయాలని ఇప్పుడు శ్యాం పిట్రోడా కమిటీ సిఫార్సు చేసింది. ఇందుకు అంగీకరించి బిఎస్ఎన్ఎల్ బోర్డు ఈ టెండరును రద్దు చేసింది.

ఒక వంక ల్యాండ్‌లైన్ మార్కెట్ తగ్గుతుండగా మరో వంక మొబైల్ మార్కెట్‌లో ముందుకు పోనీయకుండా ఈ విధంగా ఆటంకాలు సృష్టించినందున, దీనికి తోడు మార్కెటింగ్ మరియు సేల్సు విషయంలో మేనేజిమెంటు వైఫల్యం వలన బిఎస్ఎన్ఎల్ ఆదాయం, లాభం విపరీతంగా తగ్గింది. 2005-06లో రూ. 10,000 కోట్లుగా వున్న లాభం 2008-09లో రూ. 574 కోట్లకు పడి పోయింది. 2009-10లో సుమారు రూ. 2000 కోట్లు నష్టం వచ్చే అవకాశం వుంది. అయితే ఇది ఒక ప్రత్యేక పరిస్థితిలో ఏర్పడుతున్న నష్టం. 2007 నుండి అధికారులకు, ఉద్యోగులకు వేతనాలు పెంచినందున చెల్లించాల్సిన బకాయిలను 2009-10 బడ్జెటులో చూపినందున ఈ నష్టం వచ్చింది. ఈ బకాయిల చెల్లింపు ఆ తరువాత వుండదు. కాబట్టి లాభం నామమాత్రంగానైనా వచ్చే పరిస్థితి వుంటుంది. ఈ తాత్కాలిక పరిస్థితిని చూపించి బిఎస్ఎన్ఎల్ పని అయి పోయిందని తీర్పు చెప్పాల్సిన అవసరం లేదు.

***శ్యాంపిట్రోడా సిఫార్సులు అసమంజసం***

12 కోట్ల వినియోగదారులున్న ఎయిర్‌టెల్‌లో 25 వేల ఉద్యోగులే వుండగా 9 కోట్ల వినియోగదారులున్న బిఎస్ఎన్ఎల్‌లో 3 లక్షల ఉద్యోగులు వుండటం చాలా ఎక్కువ అని, వీరిలో లక్ష మందిని తొలగించాలని శ్యాంపిట్రోడా సిఫార్సు చేయటం అసంగతం. ఎయిర్‌టెల్‌కు ల్యాండ్‌లైన్ వినియోగదారులు నామమాత్రం. మొబైల్ నెట్‌వర్క్ నిర్వహణకు ఉద్యోగుల అవసరం అంతగా వుండదు. అంతేగాక నెట్‌వర్క్ స్థాపన, నిర్వహణతోసహా అన్ని పనులనూ ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చింది. కాబట్టి దానికి ఉద్యోగుల అవసరం నామమాత్రం. ఇందుకు భిన్నంగా బిఎస్ఎన్ఎల్, దేశంలో 80% ల్యాండ్‌లైన్సను నిర్వహిస్తున్నది. ఇందుకు పెద్ద సంఖ్యలో ఉద్యోగుల అవసరం వుంది. ఇంతేగాక తన నెట్‌వర్క్‌ను తానే నిర్వహిస్తున్నది. కాబట్టి 3 లక్షల ఉద్యోగులు అధికం కాదు. పైగా సంవత్సరానికి 10 వేలమంది రిటైరవుతున్నారు. ఉన్న ఉద్యోగులను మారిన పరిస్థితులకు అనుగుణంగా ట్రైనింగ్ ఇచ్చి మార్కెటింగ్, సేల్సు రంగాలలో వినియోగించుకుంటే మంచి ఫలితాలను సాధించగల అవకాశం బిఎస్ఎన్ఎల్‌కు వున్నది. ఇంతేగాక ప్రభుత్వరంగ సంస్థగా ఉద్యోగాల కల్పనకు తోడ్పడటం బిఎస్ఎన్ఎల్‌కు గల సామాజిక బాధ్యత. ఆ బాధ్యత నుండి వైదొలగి ప్రైవేటు కంపెనీల లాగా ఉద్యోగులను తొలగించాలనటం అసమంజసం.

బిఎస్ఎన్ఎల్‌లో 30% వాటాలు అమ్మి తద్వారా ప్రైవేటు భాగస్వామ్యానికి చోటిస్తే సమర్థత పెరుగుతుందనటం వాస్తవ విరుద్ధం. 46% వాటాలు అమ్మబడిన ఎంటిఎన్ఎల్‌లో దానివలన సామర్థ్యం పెరగలేదు. వాటాలు అమ్మినందున వచ్చే నిధులతో బిఎస్ఎన్ఎల్‌ను అభివృద్ధి చేయవచ్చునని, విఆర్ఎస్‌కు నిధులు సమకూర్చుకోవచ్చునని చెప్పటం బూటకం. ఎందుకంటే వాటాల అమ్మకం వలన వచ్చే సొమ్ము ప్రభుత్వ ఖజానాకే దక్కుతుంది. అందులో ఒక్క పైసా కూడా బిఎస్ఎన్ఎల్‌కు దక్కదు. బడా పెట్టుబడిదారులకు పన్నుల మినహాయింపు తదితర రాయితీలు అనుచితంగా ఇచ్చినందున ప్రభుత్వ ఖజానాకు ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకే ప్రభుత్వరంగ సంస్థల వాటాల విక్రయం జరుగుతున్నది. అంతేగాని, ప్రభుత్వరంగ సంస్థల ఉద్ధరణకి కాదు. పైగా విలువైన ప్రభుత్వరంగ సంస్థల వాటాలను బడా పెట్టుబడిదారులకు చౌకగా అమ్మి ఆ రూపంలో కూడా వారికి గాలివాటు లాభాలు చేకూర్చటం జరుగుతున్నది. ప్రైవేటు టెలికం కంపెనీలైన ఎయిర్‌టెల్, వొడోఫోన్‌ల మాదిరిగా బిఎస్ఎన్ఎల్ కూడా తన నెట్‌వర్క్ స్థాపన, నిర్వహణను పరికరాలు సప్లై చేసే విదేశీ కంపెనీలకే అప్పగించాలనటం దేశ భద్రతా ప్రయోజనాలకు విరుద్ధం. రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్‌కు ప్రైవేటు భాగస్వామ్యంతో సబ్సిడియరీ సంస్థను ఏర్పాటు చేయాలనటం విలువైన బిఎస్ఎన్ఎల్ ఖాళీ

స్థలాలను ప్రైవేటు రియల్ ఎస్టేట్ మాఫియా లకు అప్పగించటానికే. మొత్తంగా చూస్తే శ్యాం పిట్రోడా సిఫార్సుల ఉద్దేశం బిఎస్ ఎన్ఎల్ రక్షణకు కాకుండా, భక్షణకే.

### ***ఉద్యోగుల, అధికారుల ఐక్య పోరాటం***

బిఎస్ఎన్ఎల్‌ను భక్షించేందుకు ఉద్దేశించబడిన శ్యాం పిట్రోడా సిఫార్సులను రద్దు చేయాలని, 9 కోట్ల లైన్ల జిఎస్ఎమ్ ఎక్విప్‌మెంటు కొనుగోలు వెంటనే జరిగేలా చేసి బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి తోడ్పడాలని, మేనేజ్‌మెంటు పై రాజకీయ ప్రభావం లేకుండా చూడాలని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు కోరుతున్నారు. ఇందు కోసం సమైక్యంగా పోరాడాలని నిర్ణయించారు. 26.3.10న దేశవ్యాపితంగా ధర్నాలు నిర్వహించారు. 20.4.10 నుండి నిరవధిక సమ్మెకు నిర్ణయించారు. ఇది ఆహ్వానించ తగిన పరిణామం. గతంలో బిఎస్ఎన్ఎల్ వాటాల అమ్మకాన్ని ప్రభుత్వం ప్రతిపాదించగా, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు సమైక్యంగా పోరాడి ఆపుచేయించారు. వామపక్షాల, ప్రగతిశీల శక్తుల మరియు ఇతర ట్రేడ్ యూనియన్ల మద్దతు ఇందుకు తోడ్పడింది. ఇప్పుడు తలపెట్టిన ఈ పోరాటం కూడా విజయవంతమవుతుంది.

### ***ప్రత్యామ్నాయం***

పైన తెలియజేసిన విధంగా ఉద్యోగుల-అధికారుల పోరాటాలు తాత్కాలికంగా విజయాలు సాధిస్తున్నాయి. అయినప్పటికి స్వదేశీ-విదేశీ బడా పెట్టుబడిదారుల కూటమి ప్రభుత్వ మద్దతుతో చేస్తున్న దాడి కొనసాగుతున్నది. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, అధికారులు తమ పోరాటం మరింత బలపడి, ఈ దాడిని బలంగా త్రిప్పి కొట్టాలంటే టెలికం రంగంలో ప్రభుత్వం అనుసరిస్తున్న గుత్త పెట్టుబడిదారీ అనుకూల విధానానికి ప్రత్యామ్నాయంగా దేశ ప్రయోజనాలకు అనుకూలమైన ఒక ప్రత్యామ్నాయ విధానాన్ని ప్రజల ముందుంచి, అందుకోసం కలిసి వచ్చే అన్ని శక్తులను కూడగట్టుకొని పోరాడాలి. ఈ ప్రత్యామ్నాయ విధానంలో ఈ క్రింది అంశాలు ఉండాలి.

1. టెలికం రంగంలో స్వావలంబన కావాలి. ఇందుకోసం-

అ) టెలికం పరికరాలను ఉత్పత్తి చేసే ఐటిఐ, హెచ్‌సిఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థలను స్వదేశీ ప్రైవేటు ఉత్పత్తిదారులను ప్రోత్సహించాలి. టెలికం సర్వీసులు అందించే ప్రభుత్వరంగ సంస్థలు (బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్), ప్రైవేటు కంపెనీలు (ఎయిర్‌టెల్, వొడాఫోన్ మొ॥) తమ నెట్‌వర్క్ విస్తరణకు అవసరమైన పరికరాలను స్వదేశీ కంపెనీల నుండే కొనుగోలు చేసేలా చూడాలి.

ఆ) స్వదేశీ టెలికం పరికరాల తయారీ సంస్థలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందేందుకు ఆ పరిజ్ఞానం గల విదేశీ కంపెనీలకు మైనారిటీ భాగస్వామ్యం కల్పించి అవి తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వదేశీ సంస్థలకు బదిలీ చేసేలా చూడాలి. ఆ విధంగా గ్రహించిన పరిజ్ఞానాన్ని పరిశోధనల ద్వారా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వరంగ పరిశోధన, అభివృద్ధి సంస్థలను ప్రోత్సహించాలి.

ఇ) టెలికం సర్వీసుల కంపెనీలు తమ నెట్‌వర్క్‌ను ఔట్‌సోర్సింగ్‌కు ఇవ్వకుండా తామే నిర్వహించి దేశభద్రతకు సహకరించాలి.

2. ప్రైవేటు టెలికం పరికరాల ఉత్పత్తి కంపెనీలలో, ప్రైవేటు టెలికం సర్వీసు కంపెనీలలో ట్రేడ్ యూనియన్, హక్కులు కల్పించాలి. సమిష్టి సంప్రదింపుల ద్వారా వేతనాలు నిర్ణయించాలి.

3. టెలికం రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పాత్రని దేశ ప్రయోజనాలకు అవసరమైన మేరకే పరిమితం చేయాలి.

4. బిఎస్ఎన్ఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థల డిజిన్వెస్ట్‌మెంట్, ఔట్ సోర్సింగ్ ప్రతిపాదనలు విరమించాలి.

5. సామాజిక అభివృద్ధి కోసం వెనకబడిన ప్రాంతాలకు మరియు గ్రామీణ ప్రాంతాలకు నష్టాలు భరించి ల్యాండ్‌లైన్ సేవలందిస్తున్న బిఎస్ఎన్ఎల్ నుండి లైసెన్స్ ఫీజు వసూలు చేసే పద్ధతిని ప్రభుత్వం విరమించాలి. ల్యాండ్‌లైన్ నెట్‌వర్క్ విలువైన జాతీయ సంపద. ప్రస్తుతం దాని పై నష్టాలు రావటం అనివార్యం. అయినప్పటికి ల్యాండ్‌లైన్ కేబుల్ ద్వారా బ్రాడ్‌బ్యాండ్ సేవలు విస్తృతంగా అందించగలిగితే ఈ నష్టాలు తగ్గి, లాభాలు వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. అటువంటి పరిస్థితి వచ్చే వరకు బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌లకు లైసెన్స్ ఫీజు చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వాలి.

6. పబ్లిక్-పబ్లిక్ పార్టిసిపేషన్ పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు తమ టెలికం సర్వీసులను ప్రభుత్వరంగ సంస్థలైన బిఎన్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌ల నుండే పొందాలి.

7. బిఎన్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌ల మేనేజిమెంట్లు, బ్యూరాక్రాటిక్ ధోరణిని విరమించి ఒకవంక ప్రభుత్వ రంగ సంస్థగా ప్రజలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సరసమైన ధరలకు అందించే పద్ధతిని, మరో వంక ప్రైవేటు కంపెనీలతో పోటీపడి సంపన్న పారిశ్రామిక వర్గాలకు అవసరమైన ఉన్నత స్థాయి టెలికం సేవలను సమర్థవంతంగా అందించి లాభాలు పొందే పద్ధతిని అమలు చేయాలి. ఇందుకు అనుగు ణంగా పనిచేసే విధంగా ఉద్యోగులను ప్రోత్సహించాలి. ఈ సంస్థలకు మేనేజర్లుగా పనిచేస్తున్న ఐటిఎస్ అధికారులు ఈ సంస్థలలో విలీనమై, ఈ సంస్థల అభివృద్ధికి పూర్తి బాధ్యత స్వీకరించాలి.

6. ప్రైవేటు టెలికం కంపెనీలు కూడా ఎస్‌సి/ఎస్‌టి/బిసి రిజర్వేషన్లు అమలుచేసి సామాజిక న్యాయానికి తోడ్పడాలి.

ఇటువంటి ప్రత్యామ్నాయ విధానం కోసం చేసే పోరాటానికి ప్రజల మద్దతు కూడగట్టుకోవాలన్నా, బిఎన్ఎన్ఎల్ సంస్థ మరింతమంది వినియోగదారులతో బలపడాలన్నా, బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు మరింత అంకితభావంతో వినియోగదారులకు సేవలందించాలి. తమ పని సంస్కృతిని మెరుగుపరచుకోవాలి.

ఇటువంటి ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడటమే బిఎస్ఎన్ఎల్‌ను, టెలికం రంగాన్ని కాపాడి, అభివృద్ధి చేయగలదు.

**పుతుంబాక అశోకబాబు**
సహాయ ప్రధాన కార్యదర్శి
బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్